
సాక్షి
బాపట్ల
శనివారం ၊ 24 ၊ ఫిబ్రవరి ၊ 2024



భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన

నత్తెనపల్లి: స్థానిక దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం కోటి కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.70 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఘనంగా కల్యాణ మహోత్సవం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు చేశారు.

న్యూస్‌రీల్

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యాలయ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలోని మార్నింగ్‌స్టార్ కళాశాల, కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని హిందూ కళాశాల, ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుండ్లపల్లిలోని జీసీ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్, ఎన్టీఆర్ జిల్లా నున్నలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాల, బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల, మాచర్ల కేసీపీ న్యూ కాలనీలోని కిడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగే కార్యక్రమాల్లో ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ :ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి రాజశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు విజయవంతం కావాలని, ఫలప్రదమైన చర్చలు జరగాలన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం రామిరెడ్డి మాట్లాడుతూ 'మెటీరియల్ సైన్స్ అండ్ కేరెక్టరైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై మార్చి 6, 7 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు, సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, పరిశోధనా సంస్థలకు చెందిన భౌతిక శాస్త్రవేత్తలు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సెమినార్ కో- డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, కోశాధికారి ఆచార్య జి నాగరాజు, సభ్యులు ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, అధ్యాపకులు ఆచార్య వి రవికుమార్, ఆచార్య సీహెచ్ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 1,39,924 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,10,512 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,39,924 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 85,622 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

14 మందికి హెడ్‌నర్సులుగా ప్రమోషన్



గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 14 మందికి శుక్రవారం గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్‌నర్సులుగా ప్రమోషన్ ఇచ్చారు. ప్రమోషన్ కౌన్సెలింగ్‌కు 15 మందిని పిలువగా ఒకరు పదోన్నతి వద్దని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రమోషన్ సకాలంలో ఇచ్చినందుకు ఆర్డీకి ప్రమోషన్ పొందిన హెడ్‌నర్సులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక విద్యకు సై

దేశభవిష్యత్ తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది.. ఇది విద్యావేత్తల మాట. ఆ మాటలకు కార్యరూపమిచ్చింది మడమతిప్పని మహోద్యమకారుడు.. విరామమెరుగని విప్లవకారుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. దేశం మొత్తం మనవైపు చూసేలా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నారు. సాంకేతిక వినియోగంలో ముందంజలో ఉన్నారు. -గుంటూరు ఎడ్యుకేషన్

బ్లాక్ బోర్డుకు సెలవు

- ఐఎఫ్ ప్యానెల్స్ ద్వారా బోధన
- స్కూళ్లకు ఇంటర్నెట్ సదుపాయం
- జిల్లాలోని 175 పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ లూక్ సంతరించుకున్నాయి. పల్లె నుంచి పట్టణం వరకు ఏ పాఠశాల చూసినా ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారులకు స్వాగతం పలుకున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని సమూలంగా మార్చివేశారు. ప్రస్తుతం ఇంటర్నెట్ యుగం నడుస్తోంది. స్మార్ట్ ఫోన్ల వాడకం అత్యవసరమైంది. అందులో చిన్నారులు మెలకువలు వంటపట్టించుకుంటున్నారు.

పాఠశాలల్లో 624 ఐఎఫ్‌పీలు

జిల్లాలోని 175 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 624 ఐఎఫ్‌పీల ద్వారా విద్యార్థులు ఆధునిక విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి క్లాస్‌రూమ్‌కు ఒకటి చొప్పున ఐఎఫ్ ప్యానెల్ అమర్చారు. ఈ విధంగా ఒక్కో పాఠశాలకు ఐదు నుంచి 10 వరకు ఐఎఫ్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. రూ.1.26 లక్షల వ్యయం కలిగిన ఐఎఫ్‌పీలను ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసింది. ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా ఉపాధ్యాయులు తాము పాఠ్య పుస్తకంలో చెబుతున్న పాఠ్యాంశాలను విద్యార్థులకు టచ్ స్క్రీన్ ద్వారా అక్కడికక్కడే ప్రత్యక్షంగా చూపించి, వారికి అర్థమయ్యే విధంగా వివరిస్తున్నారు. తద్వారా విద్యార్థులు తరగతి గది నుంచే ప్రత్యక్ష విజ్ఞానాన్ని పొందుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల వారీగా అన్ని పాఠ్యాంశాలను బోధించడంతో పాటు పునశ్చరణ, సందేహాల నివృత్తి చేస్తున్నారు. ఎస్సీఈఆర్టీ సైట్‌లోకి వెళ్లి పాఠ్యాంశాలపై వివరణ, యూట్యూబ్ ద్వారా వీడియోలను తిలకించే సదుపాయాలను కల్పించారు. తెరపై ప్రశ్నపత్రాలను ప్రదర్శించి సమాధానాలను రాయించడంతో పాటు డయాగ్రమ్స్‌ను గీసి సేవ్ చేసుకునే ఆప్షన్ పొందుపర్చడంతో ఉపాధ్యాయులకు బోధన సులభతరంగా మారింది.

ఆండ్రాయిడ్ ట్యాబ్‌లు..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వరుసగా రెండు విద్యా సంవత్సరాల్లో 24,608 ఆండ్రాయిడ్ ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేసింది. గత విద్యాసంవత్సరంలో గుంటూరు జిల్లాలోని 181 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 12,481 మందితో పాటు ప్రస్తుత విద్యాసంవత్సరంలో మరో 12,127 మంది విద్యార్థులు ట్యాబ్‌లు అందుకున్నారు.

స్విఫ్ట్‌చాట్ యాప్‌తో సమస్త సమాచారం

స్విఫ్ట్ చాట్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల స్మార్ట్‌ఫోన్‌లోనే సమస్త పాఠ్యాంశాలను నిక్షిప్తం చేస్తూ నూతన ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధునిక విద్యాబోధనలో భాగంగా సహాయకారిగా స్మార్ట్‌ఫోన్ ద్వారా ఎటువంటి ప్రశ్నకైనా సమాధానాన్ని కనుగొనే నూతన విధానంలో తాజాగా స్విఫ్ట్‌చాట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

పేద విద్యార్థులకు అందుబాటులో..

ఒకప్పుడు ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలను బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాస్తూ బోధించేవారు. ప్రస్తుతం విద్యార్థులు చేత్తో తాకే తెరపై ప్రపంచం నలుమూలలా దాగి ఉన్న సమస్త విజ్ఞానాన్ని, సమాచారాన్ని తరగతి గది నుంచే పొందుతున్నారు. పేద విద్యార్థులకు మంచి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో బ్లాక్ బోర్డు స్థానంలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందుతోంది. గత ప్రభుత్వాల పాలనలో పాఠశాలల్లో టీవీ ఏర్పాటు చేయడమే గొప్పగా చెప్పుకున్న పరిస్థితుల్లో ప్రస్తుతం ప్రపంచస్థాయిలో మేటి ఆధునిక విద్యాబోధనకు కేరాఫ్‌గా నిలిచిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)ను పాఠశాలల్లో వందలాదిగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం టెక్నాలజీ విద్యను పేద వర్గాలకు అందుబాటులోకి తెచ్చింది.

పాఠశాలస్థాయి నుంచి సాంకేతిక విద్య



పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడంలో భాగంగా ప్రభుత్వం విప్లవాత్మకమైన అడుగులు వేస్తోంది. సాంకేతికపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడమే ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లు, స్విఫ్ట్‌చాట్ యాప్ లక్ష్యం. ఆధునిక సాంకేతిక విద్యను అందించడం ద్వారా భవిష్యత్తులో సాంకేతిక విద్యావంతులుగా ఎదిగేందుకు క్లౌడ్ కంప్యూటింగ్, క్రియేటివిటీ, ఫైల్ షేరింగ్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాచారాన్ని అందుకోవచ్చు. తరగతి గది నిర్వహణను సులభతరం చేశాయి.

-బి.లింగేశ్వరరెడ్డి, ఆర్జేడీ పాఠశాల విద్య

విద్యార్థుల్లో ఉత్సాహం



నాడు- నేడు ద్వారా మా పాఠశాలను నగరంలోనే మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దిన ప్రభుత్వం తరగతి గదుల్లో తొమ్మిది ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా జరుగుతున్న విద్యాబోధనపై ఉపాధ్యాయులు ఆసక్తి చూపిస్తున్నారు. విద్యార్థినులు రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరు కావడంతో పాటు ఐఎఫ్‌పీల ద్వారా చెబుతున్న పాఠ్యాంశాలపై ఎంతో ఉత్సాహం కనబరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులతో సాగిస్తున్న విద్యా బోధన తీరు, తెన్నులపై తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

-బి.విజయలక్ష్మి, హెచ్‌ఎం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, గుంటూరు

నేడు కొండగురునాథుని తిరునాళ్ల

గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు



నూజెండ్ల: నూజెండ్ల మండలం రవ్వారం సమీపంలో వెలసిన కొండగురునాథుని స్వామి తిరునాళ్లకు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుంచి రెండురోజులపాటు నిర్వహించే తిరునాళ్లకు గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు లక్షల సంఖ్యలో తరలి రానున్నారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున తిరునాళ్ల జరుపుకోవటం ఆనవాయితీ. కొండ గురునాథున్ని దర్శిస్తే కోర్కెలను తీరుస్తాడని భక్తుల విశ్వాసం, అలాగే కొండపైన వెలసిన సంతాన లింగేశ్వరున్ని ఆరాధిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. శనివారం కొండమెట్ల పూజతో ప్రారంభమయ్యే తిరునాళ్ల ఆదివారంతో ముగుస్తుందని ఆలయ కమిటీ తెలిపింది. తిరునాళ్లకు పదికి పైగా భారీ ఎలక్ట్రికల్ ప్రభలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం సత్రాల వారు అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యంతోపాటు నూజెండ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. వినుకొండ ఆర్టీసీ డిపోతోపాటు ప్రకాశం జిల్లా అద్దంకి, దర్శి, పొదిలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఐనవోలు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5800, గరిష్ట ధర రూ.7500, మోడల్ ధర రూ.6400 వరకు పలికింది.

'అమృత్'లో స్టేషన్ల అభివృద్ధికి రూ.221.42 కోట్లు

- 26న ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన
- ఆర్‌యూబీలకు మరో రూ.36.28 కోట్లు మంజూరు
- వివరాలు వెల్లడించిన డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, పక్కన ఏడీఆర్‌ఎంలు శ్రీనివాస్, సైమాన్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 13 అమృత్ భారత్ స్టేషన్లు, పది ఆర్‌యూబీలకు ఈనెల 26వ తేదీ ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి దశలో రేపల్లె స్టేషన్, పిడుగురాళ్ల, దొనకొండ స్టేషన్లకు నిధులు మంజూరు కాగా పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. రెండో దశలో 13 స్టేషన్లకు గాను రూ.221.42 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిలో గుంటూరు స్టేషన్‌కు రూ.40.67 కోట్లు, మంగళగిరి స్టేషన్‌కు రూ.12.56 కోట్లు, నంద్యాల రూ.21.80 కోట్లు, గిద్దలూరు రూ.11.72 కోట్లు, కంభం రూ.11.72 కోట్లు, మార్కాపూర్ రూ.21.50 కోట్లు, నరసరావుపేట రూ.23.12 కోట్లు, వినుకొండ రూ.12.45 కోట్లు, సత్తెనపల్లి రూ.11.29 కోట్లు, నడికుడి రూ.11.29 కోట్లు, మాచర్ల రూ.9.51 కోట్లు, మిర్యాలగూడ రూ.16.78 కోట్లు, నల్గొండ రూ.17.01 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

ఆర్‌యూబీలకు నిధులు

అదే విధంగా గుంటూరు డివిజన్ పరిధిలోని పది ఆర్‌యూబీలకు రూ.36.28 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కురిచేడు గేటుకు రూ.2.15 కోట్లు, వినుకొండ టౌన్ గేటు రూ.5.01 కోట్లు, మునుమాకా గేటు రూ.2.49 కోట్లు, వేమూలూరిపాడు గేటు రూ.5.01 కోట్లు, కొప్పూరావురు గేటు రూ.5.90 కోట్లు, కంత్తేరూ గేటు రూ.5.90 కోట్లు, దాచేపల్లి గేటు రూ.2.49 కోట్లు, నార్కెట్‌పల్లి గేటు రూ.2.48 కోట్లు, ఛుధారమ్ గేటు రూ.2.38 కోట్లు, కేసరాజుపల్లి గేటు రూ.2.47 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఆర్‌యూబీలను జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం, ఆర్. శ్రీనివాస్, కె.సైమాన్, సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్ కుమార్, సీనియర్ డీపీఓ షేక్ షహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

పేదలందరికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



పట్టాలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా రిజిస్ట్రేషన్ ఖర్చు లేకుండా నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం కింద ఇళ్ల పట్టాలు అందజేయడం చారిత్రాత్మక నిర్ణయం అని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఎన్.అగ్రహారంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లాలో జగనన్న కాలనీలో నివేశన స్థలాలు ఇచ్చిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను కలెక్టర్ రంజిత్ బాషా అందజేశారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆస్తిగా నివేశన స్థలంపై పూర్తి హక్కు కల్పించారని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 48 వేల మందికి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందజేసినట్లు తెలిపారు. పేదలకు సొంతిల్లు కల్పించటం పేదల జీవితాలు వెలుగులు నింపుతుందన్నారు. లబ్ధిదారులు తమకు ఇచ్చిన పట్టాలను సచివాలయ కేంద్రాల నుంచి వెంటనే పొంది గృహాలు నిర్మించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, బాపట్ల ఆర్డీఓ రవీందర్ పాల్గొన్నారు.

కబడ్డీ బాలుర విజేత గుంటూరు జట్టు



విజేత బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు



ద్వితీయ స్థానం సాధించిన జట్టుతో మంత్రి అంబటి రాంబాబు

- బాలికల విజేతగా శ్రీకాకుళం జట్టు
- బహుమతులు అందజేసిన మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కబడ్డీ భారతీయ గ్రామీణ క్రీడ అని, 33వ ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ క్రీడా పోటీల నిర్వహణతో సత్తెనపల్లికి సరికొత్త కళ వచ్చిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్, సత్తెనపల్లిలోని వృంద మహిళా జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా స్థాయి పోటీలకు సత్తెనపల్లి వేదిక కావడం ఆనందంగా ఉందని చెప్పారు. గ్రామాల్లో మట్టి నేలపై ఆడే స్థాయి నుంచి ప్రస్తుతం సాంకేతికత అంది పుచ్చుకొని రబ్బరు మ్యాట్లపై కబడ్డీ ఆడటం స్ఫూర్తి దాయకమన్నారు. ఫైనల్ మ్యాచ్‌ల్లో బాలురు, బాలికల జట్లు అద్భుత ఆట తీరును ప్రదర్శించాయని పేర్కొన్నారు. బాలికల విభాగంలో విజయనగరం, శ్రీకాకుళం జట్లు మొదటి స్థానం కోసం పోటీ పడగా శ్రీకాకుళం బాలికల జట్టు ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. బాలుర విభాగంలో ప్రకాశం, గుంటూరు జిల్లా మధ్య జరిగిన పోటీ ఉత్కంఠ భరితంగా సాగిందని వివరించారు. ఉత్తమ ప్రదర్శనతో పాటు అదృష్టం తోడై గుంటూరు జిల్లా విజేతగా నిలిచిందన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రకాశం, విజయనగరం జట్లు బాధపడాల్సిన పనిలేదని మీరు శక్తి మేరకు పోరాడారని అభినందించారు. అంతర్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన 20 మంది బిహార్ రాష్ట్రంలో నిర్వహించనున్న అంతర్ రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తున్నారని వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సత్తెనపల్లిలో ఈ స్థాయి పోటీలను నిర్వహించిన వృంద మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ అనూష గంగారపు, ప్రగతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, సందీప్, పరిటాల నరేష్‌లను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ సీహెచ్ ఈశ్వర్‌రెడ్డి, గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మర్రి సుబ్బారెడ్డి, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, చిలుకా జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆరిక శ్రీరామిరెడ్డి, నందిపాటి నర్సిరెడ్డి, షేక్ రన్ హుస్సేన్, శేషయ్య, ఎస్.అచ్చిరెడ్డి, సుదర్శన్, వెళంగిణిరెడ్డి, గంపా శ్రీను, శాస్త్రి, ఏ చిన్నయ్య, పానెం శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

జాయింట్ కలెక్టర్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని వ్యవసాయ అనుబంధ పథకాలపై సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం స్పందన హాల్లో నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అందుబాటులోకి తెచ్చిందని రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు ఇచ్చి వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయాలని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి సమావేశాలను గ్రామ మండల స్థాయిలో సమర్థంగా నిర్వహించి రైతులకు నెలకొన్న సందేహాలను పరిష్కరించాలని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దశరథ రామరాజు మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి కాలువలు, మురుగునీటి కాలువల నిర్వహణకు అవసరమైన ప్రతిపాదనలు ముందుగానే ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ముందుగా కాలువలు బాగు చేసుకోవడం ద్వారా సాగునీటి సమస్య జిల్లాలో ఉత్పన్నం కాకుండా ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఉద్యాన శాఖాధికారి పి.జెనెమ్మ మాట్లాడుతూ జిల్లాలో 21, 326 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు చేస్తున్నారని తెలిపారు. సమగ్ర అభివృద్ధి పథకం నుంచి పండ్లు పూలు కూరగాయల తోటలు విస్తీర్ణ పథకం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద శాశ్వత పందిళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా బిందు, తుంపర సేద్యం పథకం ద్వారా రైతు పొలాల్లో మిరప మొక్కజొన్న, వేరుశనగ, అరటి, పసుపు పంటలకు రాయితీ ఇవ్వటం జరిగిందన్నారు. బిందు సేద్యం ద్వారా 50 శాతం నీరు 60 శాతం విద్యుత్ ఆదా అవుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల, లీడ్ బ్యాంక్ మేనేజరు శివకృష్ణ, జిల్లా సూక్ష్మ నీటి పథకాల అధికారి రమణ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన స్థాయికి ఎదగాలి

నరసరావుపేట ఈస్ట్: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగ సాధనతో మాత్రమే సరిపెట్టకుండా ఉద్యోగ కల్పన దిశగా ముందడుగు వేయాలని జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె.వి.రమణ తెలిపారు. జేఎన్‌టీయూ-ఎన్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సాంకేతిక విద్య రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతోందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జేఎన్‌టీయూ-ఎన్ కళాశాలకు ఉజ్వల భవిష్యత్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.శివరామకృష్ణ, ప్రొఫెసర్ డాక్టర్ జి.పి.రాజు పాల్గొన్నారు.

కమనీయం.. తిరుపతమ్మ కల్యాణం



విద్యుత్ దీపకాంతులతో అమ్మవారి ఆలయం

పెనుగంచిప్రోలు: శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం శుక్రవారం రాత్రి 9.23 గంటలకు మఖా నక్షత్రయుక్త కన్యాలగ్న పుష్కరాంశంలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం బయట ప్రత్యేకంగా ఖమ్మంకు చెందిన కళాకారులు నిర్మించిన బంగారు ఛాయ కలిగిన మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల సాక్షిగా అమ్మవారు, స్వామి వార్ల కల్యాణ ఘట్టం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పీటలపై కూర్చొన్నారు.

క్లుప్తంగా

గుప్త నిధుల కోసం తవ్వకాలు?



అద్దంకి: ధర్మవరం గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు.. ఊరి శివారులోని పొలాల్లో పురాతన భీమలింగేశ్వర స్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయం క్రీస్తు శకం 850 సంవత్సరాల నాటిదిగా చారిత్రక ఆధారాలు చెప్తున్నాయి. ఇంత చరిత్ర కలిగిన ఆలయం కనుక అక్కడ గుప్త నిధులు ఉండి ఉండవచ్చనే ఉద్దేశంతో ఆలయంలోని నందీశ్వరుడి ముందు భాగంలో తవ్వారు. ఆ తర్వాత బండలను మళ్లీ పరిచి సిమెంటు వేశారు. ఈ విషయం శుక్రవారం ఉదయం పొలాల వైపునకు వెళ్లిన గ్రామస్తులు గనమించారు. దుండగులు పురాతన శివాలయంలో నిధి ఉండవచ్చనే ఉద్దేశంతో తవ్వకాలు జరిపి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకులు కుట్రపూరితంగా తీసుకెళ్లారు..

సొంత గూటికి చేరిన 8వ వార్డు కౌన్సిలర్



అద్దంకి రూరల్: ఎన్నికలు దగ్గర పడుతుండటంతో టీడీపీ నాయకులు రోజురోజుకూ దిగజారిపోతున్నారు. అద్దంకి మున్సిపాలిటీకి చెందిన 8వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బొజ్జా వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో గురువారం రాత్రి టీడీపీలో చేరినట్లు మీడియాలో ప్రచారం జరిగిన 24 గంటలు గడవక ముందే సొంతగూటికి చేరుకున్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాను పార్టీ మారినట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదన్నారు. తనను మున్సిపాలిటీలో సమావేశం ఉందని కుట్రపూరితంగా టీడీపీ నాయకులు కారు ఎక్కించుకుని, ఎమ్మెల్యే ఆఫీస్‌కు తీసుకెళ్లి బలవంతంగా పార్టీ కండువాను కప్పి పార్టీ మారినట్లు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. వాస్తవానికి తాను వైఎస్సార్ సీపీ అభిమానినని, తన వార్డులోని ప్రజలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలన్నీ అందజేశానని తెలిపారు. తాను ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి నాయకత్వంలోనే నడుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో తెలుగుదేశం పార్టీ ఖాళీ

- నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరిక



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: త్వరలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతుందని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరు గ్రామంలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బెజ్జం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అద్దంకి పార్టీ కార్యాలయంలో చిన హనిమిరెడ్డి పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. త్వరలో రాష్ట్రంలో, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుందన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగనన్నకు ఓటు వేయక పోయినా తమకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అందాయన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరినందుకు సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో పార్టీ పటిష్టతకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కుర్రా సుబ్బారావు, పఠాన్ జాన్‌ఖాన్, పఠాన్ అబ్దుల్ రఫీ, పందిరాజు, పఠాన్ సుభానీ, షేక్ బాషా, పారుమంచి కోటయ్య తదితరులు పార్టీలో చేరారు. నాయకులు ముప్పనేని శ్రీనివాసరావు, రాయిణి శ్రీనివాసరావు, బాచిన ఆంజనేయులు, రావూరి శ్రీనివాసరావు, నాగబోయిన తిరుపతయ్య, షేక్ ఖాశీం, బాచిన వినయ్, జాను, షేక్ రఫీ, ఏలియ, కోటయ్య, భాషా, బాచిన రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో చోరీ

- వెంకటాద్రినాయుడి మండపంలో చిన్న స్టీలు హుండీ ధ్వంసం
- చిల్లర వదిలేసి నోట్లను మాత్రమే చోరీ చేసిన వైనం
- సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుడి కదలికలు
- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీం
- నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలు



సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుడు



తాళాలు పగులకొడుతున్న నిందితుడు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయంలో గురువారం దుండగుడు హుండీ తాళాలు పగులకొట్టి నగదు దోచుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల అందించిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి రోజూ మాదిరి వాచ్‌మేన్‌లతో కలిసి అర్చకులు తాళాలు వేశారు. రాత్రి 12:45 గంటల తర్వాత ఉత్తరాన ఉన్న కృష్ణానది ఒడ్డు నుంచి దేవాలయం ప్రహరీ దూకి దుండగుడు మొదటి ప్రాకారం లోపలకు ప్రవేశించాడు. అక్కడ నుంచి ఉత్తర వైపున్న గేటు నుంచి రెండో ప్రాకారంలోకి, అక్కడి నుంచి ఉత్తరం వైపున ఉన్న మెట్ల మార్గం ద్వారా మూడో ప్రాకారంలోకి ప్రవేశించాడు. అక్కడ నుంచి ప్రణవేశ్వరుని ఆలయం మీదుగా వెంకటాద్రినాయుడు మండపంలోకి ప్రవేశించాడు. అక్కడున్న ఇనుప గ్రిల్ తలుపులకు వేసిన తాళాల్ని తనతో తెచ్చుకున్న గునపంతో పగులకొట్టి లోనికి ప్రవేశించాడు. మండపంలో శ్రీబాలచాముండేశ్వరి అమ్మవారి ఎదురుగా ఉన్న పెద్ద హుండీ పక్కనున్న చిన్న స్టీలు హుండీ తాళాల్ని పగుల కొట్టాడు. అక్కడే అమ్మవారి పాత చీరలో చిల్లర వదిలేసి నోట్లను మాత్రమే మూట కట్టుకుని వచ్చిన దారినే దేవాలయం బయటకు వచ్చాడు. వెళుతూ కృష్ణానది ఒడ్డున కూర్చొని నోట్లను మడత పెట్టుకుని కొన్ని చిల్లర నాణేలు, పాత చీరను అక్కడే వదిలి వెళ్లిపోయాడు. శుక్రవారం వేకువజామున స్వామి పూజ కార్యక్రమాల మొదలు పెట్టటం కోసం అర్చకులు వచ్చి వెంకటాద్రి నాయుని మండపం తాళాలు పగులకొట్టి ఉండటం గమనించారు. అమరావతి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ బ్రహ్మం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దేవాలయంలోని సీసీ కెమెరాలలో పుటేజీ ఆధారంగా చోరీలో పాల్గొన్న దుండగుడు ఒక్కడే అని నిర్ధారించారు. ఘటన స్థలిలో వదిలి వెళ్లిన గునపం, హుండీ పైన, ఇనుపగ్రిల్స్ తలుపులపైన వ్రేలిముద్రల్ని క్లూస్‌టీం సేకరించింది. ఈవో వేమూరి గోపీనాథశర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనపై దేవాలయ ఈవో వేమూరి గోపీనాథ శర్మ మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం కలిగిన దేవాలయంలో ఇటువంటి దురదృష్ట సంఘటన జరగడం బాధాకరమని తెలిపారు. దేవాలయంలో ఉన్న 32 సీసీ కెమేరాల్లో 31 పని చేస్తున్నాయని చెప్పారు. చోరీ ఘటనపై స్థానిక సీఐ ఎ.వి. బ్రహ్మం మాట్లాడుతూ సీసీ కెమెరాలలో చోరీకివచ్చి నిందితుని కదలికలు స్పష్టంగా నమోదయ్యాయని తెలిపారు. వాటితో పాటు వేలిముద్రలు, చోరీ జరిగిన తీరును బట్టి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని పేర్కొన్నారు.

చోరీ దర్యాప్తు వేగవంతం చేయాలి

అమరావతి: ప్రసిద్ధ అమరావతి అమరేశ్వర స్వామి దేవాలలయంలో హుండీ పగులకొట్టి నగదు చోరీ కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పోలీసుల్ని కోరారు. చోరీ ఘటనపై ఆయన శుక్రవారం మాట్లాడుతూ కోట్లాది మంది ఎంతో నమ్మకంతో పూజించే అమరేశ్వరాలయంలో జరిగిన చోరీపై పోలీసులు అన్నికోణాలలో త్వరితగతిన విచారణ చేసి దుండగుడిని పట్టుకోవాలని కోరారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను కాపాడటానికి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా దేవదాయ, పోలీసు శాఖ సంయుక్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయ భద్రత ఏర్పాట్లపై పునఃసమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అమరజవానుల పిల్లలకు సీటు కేటాయింపుపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) లో సర్వీసులో ఉండగా ప్రాణాలు కోల్పోయిన అమరవీరులైన జవాన్‌ల పిల్లలకు ట్యూషన్ ఫీజు లేకుండా ప్రతి కళాశాలకు ఒక సీటు కేటాయించే విధంగా ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకోవడం పట్ల సీఆర్పీఎఫ్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్ గోపాలకృష్ణ, ఉదయభాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత నెల 21న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో భాగంగా దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమర జవానుల కుటుంబాలకు అండగా ఉండాలని భావించి కళాశాలల యాజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాసిరెడ్డి విద్యాసాగర్ వివరించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల పరిధిలో ప్రతి కళాశాలలో ఒక సీటును సీఆర్పీఎఫ్ కార్యనిర్వహణలో అమరులైన, గ్యాలంటరీ పురస్కారాలు పొందిన జవానుల పిల్లలకు కేటాయించనున్నట్లు తెలిపారు. కళాశాలలో సీటు పొందిన విద్యార్థులకు ఆ కళాశాల ట్యూషన్ ఫీజు రాయితీ అందించనున్నట్లు వెల్లడించారు. ఇటువంటి మంచి పనికి ముందుకు వచ్చిన అసోసియేషన్‌లో భాగమైన కళాశాలలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై సదస్సు

గుంటూరు రూరల్: పత్తి పంటల్లో పత్తి తీతల అనంతరం చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం, నాగపూర్ కేంద్రియ పరిశోధన స్థానం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో, లాం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పత్తి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సుధారాణి మాట్లాడుతూ పత్తి తీతల అనంతరం గులాబీరంగు పురుగుల నివారణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పత్తి తీత అనంతరం చేలో గొర్రెలను మేపాలని, మల్చర్, లేదా రోటీవేటర్ సహాయంతో పత్తి మొక్కలను చిన్నచిన్న ముక్కలుగా కట్‌చేసి భూమిలో కలియదున్నాలన్నారు. దీనివల్ల నిద్రావస్థలో ఉన్న గులాబీ రంగు పురుగుల లార్వాలను నాశనం చేయవచ్చన్నారు. దీనివల్ల వచ్చే ఏడాది వేసే పత్తి పంటలో గులాబీరంగు పురుగు నష్టాన్ని తగ్గించవచ్చని సూచించారు. క్షేత్రస్థాయిలో పత్తి పంటలను చిన్నముక్కలుగా ట్రాక్టర్ సహాయంతో ఏవిధంగా చేయాలో చేసి చూపించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ జి దయానా, డాక్టర్ ఎన్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఓ శారద, రైతులు తదితరులున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే రోత రాతలు

ఎల్లో మీడియాపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ నేతలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, నేతలు

బల్లికురవ: మండలంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఎల్లో మీడియా విషపు వార్తలు ప్రచురిస్తోందని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డి.బ్రహ్మారెడ్డి ధ్వజమెత్తారు. బల్లికురవలోని ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈనాడు పత్రికలో 'కొండను కొల్లగొట్టి బిల్లు పెట్టి' అనే శీర్షికతో రాసిన కథనంపై మండిపడ్డారు. మండలంలోని కొణిదెన, గంగపాలెం, ముక్తేశ్వరం, వల్లాపల్లి, వెలమవారిపాలెం కొత్తూరు గ్రామాల్లో ప్రజల కోరిక మేరకు లింకు రోడ్లు, శ్మశానాల అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ రహదారులకు ఆయా గ్రామాల పరిధిలోని భూముల్లో గ్రావెల్‌ను కొంత కాలంగా తోలుతున్నారు. అయితే గ్రానైట్ క్వారీలు, అటవీ భూముల్లోని మట్టిని రహదారులకు అక్రమంగా తరలిస్తున్నారంటూ కథనాలు రాయడాన్ని తప్పుబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో చెరవులు, కుంటలు, పేదల భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టినా.. నీరు-చెట్టులో కోట్లాది రూపాయలు నాయకులు దండుకున్నా ఆ పత్రికకు కనిపించలేదా అని ప్రశ్నించారు. టీడీపీకి ఓటమి తప్పదని తెలసి.. ఎల్లో మీడియాలో ఇటువంటి విష ప్రచారం చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు నెలల క్రితమే వల్లాపల్లిలో సచివాలయ భవనం నిర్మాణం జరిగి.. గ్రామ పంచాయతీ సెక్రటరీకి అప్పగించడంతోనే తాము ప్రారంభించామన్నారు. కానీ, తాళాలు పగులగొట్టి ప్రారంభించారని రాయడం ఏమిటని సొసైటీ ప్రెసిడెంట్ ప్రశ్నించారు. ముక్తేశ్వరం, వెలమవారిపాలెం మాజీ సర్పంచ్‌లు, కొనిదుల శంకర్‌రెడ్డి, మావిళ్ల పల్లి తిరుపతి దానయ్య, మండల కో- అప్షన్ సభ్యుడు షేక్ శీనువలి, వైఎస్సార్ సీపీ నేతలు మాదాల శివన్నారాయణ, అంజిరెడ్డి, మద్దినేని అశోక్, పావులూరి చందు, బొంతు మోహన్, బడుగు సురేశ్ పాల్గొన్నారు.

వలంటరీ రిటైర్మెంట్‌కు పాఠశాల యజమాన్యం ఒత్తిడి

ఆందోళన చేపట్టిన ఇద్దరు ఉపాధ్యాయులు



పాఠశాల గేటు బయట బైఠాయించిన ఉపాధ్యాయులు

పర్చూరు (చినగంజాం): పాఠశాల యాజమాన్యం తమను విధుల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటూ వేధింపులకు గురిచేస్తోందని ఇద్దరు ఉపాధ్యాయులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల మేరకు.. పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని ఆంధ్రకేసరి ఎయిడెడ్ పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా సీహెచ్ వెంకటేశ్వర్లు, తెలుగు ఉపాధ్యాయురాలిగా కె.పద్మావతి పనిచేస్తున్నారు. అయితే వీరు.. శుక్రవారం యాజమాన్యం విధుల్లోకి రానివ్వకుండా అడ్డుకుందని పాఠశాల బయట గేటు వద్ద కూర్చుండిపోయారు. ఈ విషయమై వారు స్పందిస్తూ.. పాఠశాల యాజమాన్యం తమను వలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తోందని చెప్పారు. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో కూడా రిటైర్మెంట్ ఇవ్వాల్సిందిగా ఒత్తిడి తీసుకొచ్చారని, తప్పని పరిస్థితిలో ఇస్తామని ఒప్పుకొనే విధంగా చేశారన్నారు. గతేడాది జూన్‌లో ఐదు నెలల పాటు జీతం ఆపారని తెలిపారు. కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో అర్జీ పెట్టుకోవడంతో జీతాలు ఇచ్చారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు అదే విధమైన ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు పండిట్ కె.పద్మావతమ్మ మాట్లాడుతూ తన రిటైర్మెంట్‌కు మూడేళ్ల సమయం ఉందన్నారు.

బైకులు ఢీ-వ్యక్తి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాద ఘటనలో పడి ఉన్న బైకులు, క్షతగాత్రులు

మేదరమెట్ల: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల దక్షిణ బైపాస్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పమిడిపాడు అగ్రహారానికి చెందిన కోరంపల్లి ఆంజనేయులు (43) అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి తమ్మిశెట్టి ఏడుకొండలు ఇద్దరూ కలసి బైకుపై ఒంగోలు వెళ్లి.. పని ముగించుకొని తిరుగుప్రయాణం అయ్యారు. మోటారు బైకు తిమ్మనపాలెం జాతీయ రహదారి దాటి మేదరమెట్ల సమీపంలోకి రాగానే అదే సమయంలో రాంగ్‌రూట్‌లో మరో బైకు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. వీరిలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రగాయాలైన ఏడుకొండలు, మేదరమెట్లకు చెందిన ఏ.క్రాంతికుమార్‌ను 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు


సత్తెనపల్లి: బిహార్‌లో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ బాల బాలికల జట్లను సత్తెనపల్లిలోని వృంద మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎంపిక చేశారు. 33వ ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతల నుంచి రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేశారు.

బాలికల జట్టు: పి.యమున (శ్రీకాకుళం), పి.హారతి (శ్రీకాకుళం), ఎం.పావని (విజయనగరం), ఎస్.లక్ష్మీదేవి (విజయనగరం), పి.ద్రాక్షాయణి (విశాఖపట్నం), బి.దివ్య (విశాఖపట్నం), ఈ.దేవకీబాయి(గుంటూరు), పి.గౌతమి (అనంతపురం), ఎస్.హిందూ(వైఎస్సార్ కడప), కె.నిరీష (నెల్లూరు), వి.నేత్ర (చిత్తూరు), బి.శిరీష (కర్నూలు), కె.సిబోరా (ప్రకాశం), టి.దివ్యశ్రీసత్య (పశ్చిమ గోదావరి), బి.మాధవి (కృష్ణా), ఓ.వాత్సల్య (తూర్పుగోదావరి), కోమలి (విశాఖ పట్నం), షేక్ అప్సనా బేగం (గుంటూరు), అనురాధ (విజయనగరం), బి.ఆకాంక్ష (శ్రీకాకుళం)లు ఎంపికయ్యారు.

బాలుర జట్టు: ఎ.అభిలాష్ రెడ్డి (ప్రకాశం), బి.భవాని శంకర్ రెడ్డి (ప్రకాశం), ఎ. అశోక్‌రెడ్డి (ప్రకాశం), బి.బ్రహ్మయ్య (వైఎస్ఆర్ కడప), బి.సంతోష్ (వైఎస్ఆర్ కడప), వి.అబూత్‌కుమార్ (గుంటూరు), హెచ్‌ఎస్ తరుణ్ (గుంటూరు), కె.ప్రశాంత్ (గుంటూరు), ఆర్‌హెచ్. రాహుల్ (చిత్తూరు), ఎల్.జయశక్తి (చిత్తూరు), జి.త్రిమూర్తులు (తూర్పుగోదావరి), వి.అక్షయ్ కుమార్ (తూర్పుగోదావరి), బి.శ్రీను (విశాఖపట్నం), ఎం.సుమంత్ (కృష్ణా), ఏ.శ్రీకాంత్ (నెల్లూరు), బి.భాను ప్రకాష్ (విజయనగరం), షేక్ అబ్దుల్‌రషీద్ (పశ్చిమగోదావరి), బి.కుమార్ వెంకటేష్ (పశ్చిమగోదావరి), ఎస్.లోకేష్ (విశాఖపట్నం), కె.దశరథుడు (వైఎస్ఆర్ కడప)లు ఎంపిక అయ్యారు. ఎంపికైన జట్లను మంత్రి అంబటి రాంబాబు, వృంద మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ అనూషా గంగారపు అభినందించారు.

ఘనంగా విశ్వంజీ జన్మదిన వేడుకలు

హాజరైన హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్



కల్యాణ మందిరాన్ని విశ్వంజీతో కలిసి ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్ రామచంద్రరావు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకొండ్రుపాడులో గల విశ్వనగర్‌లో విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 80వ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు వేడుకలకు ముఖ్య అతిథిగా హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్ రామచంద్రరావు హాజరయ్యారు. గురుపీఠంలో విశ్వంజీని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. తదనంతరం నూతనంగా నిర్మించిన విశ్వశ్రీ కల్యాణ మందిరాన్ని విశ్వంజీతో కలిసి రామచంద్రరావు ప్రారంభించారు.

విష్ణు సహస్రనామ పారాయణం..

విశ్వంజీ జన్మదిన వేడుకల్లో భాగంగా గుంటూరు బృందావన క్షేత్రం విష్ణు సహస్రనామ పారాయణ సంఘం బృందం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ప్రజలంతా వంశవృద్ధి, శత్రుభయ నివారణ కలిగి ఉండాలని కోరుతూ శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం చేశారు. కల్యాణాన్ని విశ్వమానవ సమైకృతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులతో విశ్వంజీ ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం శ్రీ శృంగేరీ శారదాపీఠం ఆస్థాన పౌరాణికులు డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమానికి చెందిన కె. ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.